కూల్చేసి.. వదిలేశారు..

- ఆపరేషన్ లంగ్స్‌లో ఆగమేఘాలపై దుకాణాల కూల్చివేత
- వ్యర్థాల తొలగింపులో మాత్రం అలసత్వం
- కమిషనర్ ఆదేశించినా కానరాని చర్యలు
- రోడ్ల వెంబడి అధ్వాన పరిస్థితులు
- మొద్దు నిద్ర వీడని ప్రజారోగ్యశాఖ


మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద తొలగించని వ్యర్థాలు


సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదురుగా 20 రోజులుగా ఉన్న వ్యర్థాలు, మట్టి

మధురవాడ: జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలను కూడా కింది స్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆపరేషన్స్ లంగ్స్‌లో భాగంగా పుట్‌పాత్, రోడ్డు ఆక్రమణల పేరుతో మధురవాడలో పలు రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. వ్యాపారులు దుకాణాలు, తోపుడుబండ్ల ఏర్పాటుకోసం సిమెంటు, కాంక్రీటు ఇతర మిశ్రమాలు వేసి రోడ్డును ఎత్తు చేశారు. అధికార యంత్రాంగం ఆ దుకాణాలతో పాటు, వాటిని కూడా పూర్తిగా ధ్వంసం చేసింది. దుకాణాలతో పాటు రోడ్డు పక్కన చదును చేసిన నేలను ధ్వంసం చేశారు. ఇందులో కూడా అధికారులు పెద్దల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు.

ఇదీ పరిస్థితి..

మధురవాడ హైవే–మిథిలాపురి వుడా కాలనీ 80అడుగుల రోడ్డు పిలకవానిపాలెం, వాంబేకాలనీ రోడ్డు, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు, వుడా కాలనీ–ఆర్టీసీ డిపో జంక్షన్ గాంధీ సర్కిల్ ఏరియా, ఐటీ సెజ్ జంక్షన్, వుడా హరిత, మధురవాడ పీహెచ్‌సీ రోడ్డు, కొమ్మాది డబుల్ రోడ్డు.. ఇలా ఎక్కడ చూసినా గృహ నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్త గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.

కమిషనర్ ఆగ్రహం

రోడ్డుపక్క బడ్డీలు, తోపులు బళ్లు, చిరు వ్యాపారుల గుడిసెలు తొలగించిన తర్వాత మధురవాడలోని పలు ప్రాంతాలలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గత నెల 19న పర్యటించారు. ఆ సమయంలో రోడ్డుపై కొద్దిగా చెత్త కనిపిస్తేనే ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ గుట్టలుగా ఉన్న వ్యర్థాల సంగతేంటో ప్రజారోగ్య శాఖ అధికారులే సెలవీయాలి. డెబ్రిస్ గుట్టలుగా పేరుకుపోవడంతో రోడ్డు పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కొమ్మాది జంక్షన్ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇదీ పరిస్థితి..


ఐటీ సెజ్ రోడ్డులో వికలాంగుల కాలనీ వద్ద ఇలా..


ఇటీవల చెత్త, వ్యర్థాలు తొలగించాలని ఆదేశాలు ఇస్తున్న కమిషనర్ (ఫైల్)


వుడా హరిత వద్ద డంప్ చేసిన వ్యర్థాలు

శ్రీవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినోపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడ జరుగుతున్న చతుర్థి తిరు పవిత్రోత్సవాల సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ్, కె.సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బంగారమ్మ ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న బంగారమ్మ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. మహిళలు మొక్కులు చెల్లించారు.

క్లుప్తంగా

స్నేహితుడి వైద్యానికి సహకారం


స్నేహితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలో తమ చిన్ననాటి స్నేహితుడికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ప్రతినిధులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ ఏనుగుతల రమణ(గాంధీ) సెలూన్‌ను నిర్వహిస్తున్నారు. ఇతనికి కొంతకాలం క్రితం ప్రమాదం జరిగి, వెన్నెముక దెబ్బతినగా ఇటీవల ఆపరేషన్ జరిగింది. విషయం తెలిసిన అసోసియేషన్ ప్రతినిధులు రమణ చికిత్స కోసం ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ ఆధ్వర్యంలో రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫ్యాబ్ ప్రతినిధులు ముసునూరి సూర్య శ్రీనివాస్, గుగ్గిళ్ల సాయి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన గద్దిపిల్లి దానయ్య

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు చినరుషికొండకు చెందిన గద్దిపిల్లి దానయ్య (65) కనిపించడం లేదంటూ ఆయన భార్య గద్దిపిల్లి ఎరుకమ్మ పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 6వ తేదీన సాయంత్రం బయటకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన దానయ్య రాత్రి వరకు రాకపోవడంతో మంగళవారం రుషికొండ ప్రాంతమంతా గాలించారు. అప్పటికి ఆచూకీ తెలియకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 98664 81464 కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి యూటీఎఫ్ చేయూత


సత్యం కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు


తగరపువలస: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్.రాయవరానికి చెందిన ఉపాధ్యాయుడు వంకల సత్యం కుటుంబానికి భీమిలి యూటీఎఫ్ ప్రతినిధులు బుధవారం రూ.1.10లక్షల ఆర్థిక సాయం అందించారు. సత్యం ఇంటికి వెళ్లి, ఆయన భార్య స్రవంతిని, కుటుంబసభ్యులను పరామర్శించి, ఆ మొత్తాన్ని అందజేశారు. గతంలో భీమిలి మండలం దిబ్బడిపాలెంలో పని చేసిన సత్యం ఇటీవల బదిలీల్లో ఎస్.రాయవరం మండలానికి వెళ్లారని, ఆయన మృతి ఫెడరేషన్‌ను బాధించిందని సభ్యులు తెలిపారు. యూటీఎఫ్ భీమిలి ప్రతినిధులు ఎల్.ఎ. శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఆర్.ఆదయ్య, కోటేశ్వరరావు ఉన్నారు.

వేదభూమి మన భారతావని


లక్ష్మీపురంలో మలయాళ స్వామి

తగరపువలస: వేదాలకు పుట్టిల్లు అయిన భారత దేశంలో జన్మించడం మనం చేసుకున్న అదృష్టమని కాశీ పుణ్యక్షేత్రానికి చెందిన సద్గురు మలయాళ స్వామి అన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురంలోని కరుభుక్త అప్పలరాజు ఇంటికి వచ్చిన ఆయన అనుగ్రహ భాషణం చేశారు. పద్మనాభం మండలం మద్ది పంచాయతీకి చెందిన పర్మతానంద గిరిస్వామిని కలిసి, ఈ ప్రాంతంలో పర్యటించారు. తల్లిదండ్రులను చివరిదశలో వృద్ధాశ్రమాలలో కాకుండా పిల్లలు తమ వద్దే ఉంచుకోవాలన్నారు. నిత్యం పరమాత్ముని పూజించినా లేదా తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా చూసుకున్నా పరవాలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకప్పకు నివాళులు


వెంకప్పకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

తగరపువలస: ఇటీవల మరణించిన రెండోవార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్త చేట్ల వెంకప్పకు పార్టీ నాయకులు నివాళులర్పించారు. మృతుడి కుమారుడు, మాజీ కౌన్సిలర్ ఎల్లయ్యరెడ్డిని పరామర్శించారు. వెంకప్పకు నివాళులు అర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, శిల్లా వంశీరెడ్డి, దల్లి అప్పలరెడ్డి తదితరులున్నారు.

వరిసాగులో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన


మద్దిలపేటలో కిట్లు అందుకున్న రైతులతో ఏవో శివకోమలి

తగరపువలస: వరి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగుల మందుల వినియోగం, విత్తనాల నుంచి విక్రయం వరకు పాటించవలసిన అంశాలపై చైతన్యపరచేందుకు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఏవో బి.శివకోమలి తెలిపారు. గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, సస్యరక్షణ చర్యలపై అవగాహన, ఆరోగ్యకరమైన పంటలు పండించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా 30మంది రైతులను ఎంపిక చేసి, 25 ఎకరాల విస్తీర్ణంలో 14 వారాల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 12వ వారం సస్యరక్షణ కార్యక్రమంలో భాగంగా కిట్లు, పర్యవేక్షణ పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. దీనివలన పురుగు ఉధృతి ఎంతవరకు ఉందో తెలుస్తుందన్నారు. అనంతరం 'పొలం–పరిసరాల విశ్లేషణ' కార్యక్రమాన్ని పొలంలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి, వీఏఏ ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రూపేష్

పద్మనాభం: పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో కె.రూపేష్ కోరారు. పంచాయతీరాజ్ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్‌పై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ముందస్తుగా ప్రణాళికలు రూపకల్పన చేసుకోవాలన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలన్నారు. మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పేదరిక నిర్మూలన తదితర అంశాలపై రిసోర్సు పర్సన్ నిరుపమాదేవి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో జయ ఉమ పాల్గొన్నారు.

మధురవాడలో 3 రేషన్ డిపోలకు మెమోలు

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు ఆదేశం


మధురవాడలో రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న కాంతారావు, సివిల్ సప్లై అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడలో 3 రేషన్ డిపోలకు మెమోలు జారీ చేయాలని రాష్ట ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలలో పలు రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా శాఖలు అధికారులు, సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి పరిశీలించారు. మిథిలాపురి వుడా కాలనీ 0387409డిపోని పరిశీలించి, సమయానికి సరకులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. 0387178 డిపోలో బియ్యం నేలపై వేయడం వలన కలుషితం అవుతున్నాయని, ఇది నిబంధనలకు విరుద్ధమని మెమో ఇవ్వాలని చెప్పారు. 0387558లో బియ్యంలో ప్లాస్టిక్ కవర్స్ ఉండడం, అలాగే బియ్యం కింద పడిపోయి ఉండడాన్ని గమనించారు. ఈ డిపోకి కూడా మెమో జారీ చేయాలని, 0387030 డిపోలో లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందించడంలో విఫలమౌతున్నారని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తంగా పర్యవేక్షణ సక్రమంగా లేదని గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే ఆహారం పరిశీలించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తీక దామోదర మాసోత్సవాలు ప్రారంభం


ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ 4.30 గంటల నుండి 6 గంటల వరకు మంగళహారతి, నరసింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీపం సమర్పించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలియజేశారు.

హరేకృష్ణ వైకుంఠంలో..


శ్రీరాధా మదన్ మోహనులకు ప్రత్యేక పూజలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధా మదన్ మోహనుల మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం దామోదర దీపోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు నెయ్యి దీపాలతో ప్రత్యేక హారతి ఇచ్చి, సంకీర్తనలు ఆలపించారు.

నేటి నుంచి కనకమ్మ ఉత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ అనుబంధ 14 గ్రామాల ఆరాధ్యదేవత కనకమ్మ ఉత్సవాలు గురు, శుక్రవారాలు జరగనున్నాయి. గురువారం అమ్మవారి దేవర సందర్భంగా గ్రామంలోకి దేవతను ఆహ్వానిస్తూ 14 గ్రామాల ప్రజలు ప్రతి ఇంటి నుంచి చొప్ప కట్టలను దివిటీలుగా చేసి, జ్యోతులు వెలిగిస్తారు. తిరిగి శుక్రవారం అమ్మవారికి అనుపు నిర్వహిస్తారు. ఆలయం వద్ద అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. చిప్పాడలో ఒక ఏడాది ప్రధాన దేవత సుత్తమ్మతల్లికి పండగ, మరుసటి ఏడాది వారాలు నిర్వహిస్తారు. వారాలు నిర్వహించే ఏడాది కనకమ్మకు పండగ నిర్వహిస్తారు. సుత్తమ్మ పండగ మే నెలలో, కనకమ్మ పండగను విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాల తరువాత జరపడం ఆనవాయితీగా వస్తోంది.

అధినేతను ఘనంగా స్వాగతిద్దాం

- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను పిలుపు
- పార్టీ నియోజకవర్గ నాయకులతో విస్తృత సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నర్సీపట్నంలో నిర్మించిన వైద్య కళాశాల పరిశీలనకు గురువారం రానున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ నాయకుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారని, అక్కడి నుంచి ఎన్ఏడీ, గోపాలపట్నం, సింహాచలం, వేపగుంట మీదుగా నర్సీపట్నం వెళ్తారని తెలిపారు. ఈ క్రమంలో భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో చేరుకుని జగన్‌కు భారీగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో వ్యతిరేకత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం జరిగిందని, వాటిలో 5 కళాశాలల ప్రారంభోత్సవం కూడా జరిగిందని చిన్న శ్రీను గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కళాశాలల నిర్మాణం దేవుడెరుగు.. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదవాడికి ఉన్నత విద్య, వైద్యం అందించాలని సంకల్పిస్తే, నేటి ఈ కూటమి ప్రభుత్వం పేద వాడికి విద్య, వైద్యాన్ని దూరంగా, భారంగా మార్చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక కళాశాలలు అసంపూర్ణంగా ఉండిపోయాయని గుర్తు చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

అడ్డంకులెన్ని సృష్టించినా పర్యటన ఆగదు

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ ఉవ్వెత్తున ఉద్యమిస్తోందని, ఇందులో భాగంగా గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలను పరిశీలించనున్నారని చిన్న శ్రీను తెలిపారు. అయితే, కూటమి ఈ పర్యటనను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎంత మంది పోలీసులు అడ్డుకున్నా జగన్ చేయనున్న పర్యటనను అడ్డుకునే శక్తి ఎవరికి లేదని అన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వస్తున్నప్పుడు అడ్డంకులు సృష్టించడమేమిటంటూ ప్రశ్నించారు. ప్రజల కోసం వారి సమస్యలను తీర్చేందుకు, తెలుసుకునేందుకు చేస్తున్న ఈ పర్యటనకు ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా పర్యటన ఆగేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, జెడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, ఎస్ఈసీ మెంబర్లు దాట్ల వెంకట అప్పల ప్రసాదరాజు, పోతిన హనుమంతు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మండల అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను, వార్డులు, వివిధ విభాగాల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన ప్రసాద్, వంకాయల మారుతి ప్రసాద్, పాల రమణారెడ్డి, చిల్లా కరుణాకర్‌రెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, గాదె రోశిరెడ్డి, బొట్టా అప్పలరాజు, మజ్జి వెంకట్రావు, పోతిన ఎల్లాజీ, జగ్గుపిల్లి ప్రసాద్, కర్రి స్వామి, ముదుండి రాజేశ్వరి, సుజాత, సిరి సహస్ర, డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మట్టితో కప్పేశారు..!


మట్టితో కప్పిన ప్రాంతం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్–గుడ్లవానిపాలెం శ్మశానవాటిక మధ్యలో స్థలాన్ని భారీగా మట్టితో కప్పివేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌నగర్ బీచ్ పార్కును ఆనుకుని గుడ్లవానిపాలెం శ్మశానవాటిక వరకు మంగళవారం అర్ధరాత్రి భారీ స్థాయిలో లారీలు ఏర్పాటు చేసి, మట్టితో కప్పివేయడం సంచలనంగా మారింది. బుధవారం ఉదయం ఇటుగా వచ్చిన వాకర్లు, స్థానికులు మట్టితో కప్పిన స్థలాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీటిలో కొంతమేర అటవీశాఖ స్థలం, కొంతమేర శ్మశానవాటిక స్థలం ఉంది. ప్రధాన రహదారి వెంబడి ఇంత జరుగుతున్నా ఒక్క అధికారీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి నుంచో మట్టిని తీసుకువచ్చి ఇక్కడ వేసింది ఎవరు? అర్ధరాత్రి సమయంలో మట్టి డంప్ చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మిని వివరణ కోరగా సాగర్‌నగర్ బీచ్ సమీపంలో మట్టిని డంప్ చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని, పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మధురవాడలో భారీ వర్షం



బోరవానిపాలెం వద్ద హైవేపై కూలిన చెట్టు కొమ్మను తొలగిస్తున్న యువత


మారికవలసలో గెడ్డ అంచులు ఆక్రమణకు గురవడంతో రోడ్డుపైనే ప్రవహిస్తున్న వర్షం నీరు

మధురవాడ: మధురవాడలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ, ఉక్కపోత ఉండగా.. 11 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పరదేశిపాలెం–కార్‌షెడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1గంట వరకు కుండపోత వర్షం పడింది. బోరవానిపాలెం వద్ద హైవేపై భారీ చెట్టు కొమ్మ కూలిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. కొందరు యువకులు అతికష్టం మీద కొమ్మను పక్కకు లాగడంతో ట్రాఫిక్ అవస్థలు తీరాయి. మారికవలస సర్వీసు రోడ్డులోని గెడ్డ అంచుల్లో బడ్డీలు రావడంతో వర్షం నీరు రోడ్డు పైనే ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డైలీ మార్కెట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వినియోగదారులు, ద్విచక్రవాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.


చెరువులా మారిన మధురవాడ డైలీ మార్కెట్–హాస్పిటల్ రోడ్డు

జీరుపేటకు పదిరోజులుగా అందని తాగునీరు


నీరు సరఫరా కాని వాటర్‌ట్యాంక్

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీలోని జీరుపేట గ్రామస్తులు పదిరోజులుగా తాగు నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. జీరుపేట గ్రామంలో వ్యక్తిగత బోర్లు దాదాపు పనిచేయవు. ఇక్కడ 350 నుంచి 400 అడుగుల లోతుకు వెళ్లినా నీరు పడటం లేదు. దీంతో జీరుపేటలో ఉన్న 10వేల లీటర్ల వాటర్ ట్యాంకుకు విజయనగరం జిల్లా భోగాపురం మండలం రావాడ శివారులోని మోటారు ద్వారా నీరు సరఫరా అవుతోంది. పదిరోజులుగా మోటారు పనిచేయని కారణంగా సుమారు 200 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. తమ సమస్యను సచివాలయ సిబ్బంది, భీమిలిలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజుల క్రితం పంచాయతీలో జరిగిన గ్రామసభ దృష్టికి కూడా తీసుకువెళ్లామని, అయినా ఫలితం లేకపోయిందని తెలిపారు. అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించకపోతే భీమిలి మండల పరిషత్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల కార్యాలయాలను ముట్టడిస్తామని జీరుపేట గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.